

నేడు ఎస్ఐ ఉద్యోగాలకు రాత పరీక్ష

హాజరు కానున్న 8458 మంది అభ్యర్థులు

ప్రజాశక్తి-విజయనగరం

ఎపిఎస్ఎల్‌పిఆర్‌బి ఆధ్వర్యాన సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు ఉద్యోగ నియామకాలకు ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక రాత పరీక్ష జరుగనుంది. జిల్లాలోని 10 పరీక్షా కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షకు 8,458 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ప్రాథమిక రాత పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎస్‌పి ఎం.దీపిక పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. పేపర్ 1 పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు, పేపరు 2 పరీక్ష మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులను గంట ముందు నుంచి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. ఒక్క నిముషం ఆలస్యమైనా అనుమతించరు. అభ్యర్థులు గుర్తింపుగా ఆధార్‌కార్డు లేదా పాన్‌కార్డు, డ్రైవింగ్‌లైసెన్సు, ఓటరు కార్డు, రేషన్‌కార్డు వంటి ఏదైనా ఒరిజినల్ గుర్తింపుకార్డును తీసుకెళ్లాల్సి ఉంది.



లక్ష్యం కొండంత.. వచ్చింది గోరంత అన్న చందంగా నగర పాలక సంస్థలో పన్నుల వసూలు ఉంది. మరో 40 రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఈ సమాయానికి కనీసం 60నుంచి 70శాతం పన్నులు వసూలు చేయాల్సి ఉండగా నేటికి సగం మాత్రమే వసూలు అయ్యింది. మిగతా 50శాతం ఉన్న 40 రోజుల్లో వసూలు అవుతుందా అంటే అనుమానమే. ఏటా ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 60 శాతం మించి వసూలు కావడం లేదు. ఈఏడాది అయినా కనీసం 80శాతం పన్నులు వసూలు అవుతాయో లేదోనని రెవెన్యూ విభాగం సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. ఇందులో అత్యధిక శాతం ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు ఉండడం గమనార్హం.

వచ్చింది రూ.23కోట్లే !

పేరుకుపోతున్న ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు ● పన్నుల వసూళ్లలో మెరుగుపడేనా?

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కార్పొరేషన్‌లో ఈ ఏడాది రూ.43కోట్లు పన్నుల ద్వారా ఆదాయం రావాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం రూ.23.89 కోట్లు మాత్రమే అవసూలైంది. వాస్తవానికి గత ఏడాది కంటే ఈఏడాది ఇదే సమాయానికి ఏడు కోట్లు అదనంగా వసూలు చేశారు. కానీ నగర పాలక సంస్థ అవసరాలు, ప్రజల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకొని పూర్తి స్థాయిలో పన్నులు వసూలు చేయగలిగితే ప్రజలకు కొంత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుంది. మిగిలిన రూ.20కోట్లు వసూలుకు ముగ్గురు ఆర్ఐలతో టీమ్‌లు వేసినా, సచివాలయ ఉద్యోగులతో ప్రతి వార్డులో వసూలు చేయించినా లక్ష్యం పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదు.

పేరుకుపోతున్న ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన పన్నుల బకాయి రూ.15కోట్లుకు చేరింది. ఫిబ్రవరి 17నాటికి రూ.15.33 కోట్లు రావాల్సి ఉండగా, ఇంత వరకు వసూలైంది కేవలం రూ.92లక్షలు మాత్రమే. ఇంకా రూ.14కోట్లుపైనా ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సి ఉంది. వీటిలో ఒక్క వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డు నుంచే రూ.16 లక్షలు రావాల్సి ఉంది. ఇలా అన్ని ప్రభుత్వ కార్యాలయాల నుంచి లక్షల రూపాయలు బకాయి ఉంది.

535 మంది నుంచి రావాల్సింది రూ.25 కోట్లు

నగరంలో రూ.50వేలు దాటి పన్నులు కటాల్సిన వారి సంఖ్య సుమారుగా 535 మంది వరకు ఉన్నారు. వారి నుంచి బకాయిలు, ఈఏడాది చెలించాల్సిన పన్నులు, 23 కోర్టు కేసుల నుంచి నగర పాలక సంస్థకు పన్నులు సుమారు రూ.25 కోట్లు రావాల్సి ఉంది. పేదలు నుంచి ముక్కు పిండి పన్నులు వసూలు చేస్తున్న అదికారులు, ఈ 535 మంది నుంచి ఎందుకు వసూలు చేయడంలేదో, వారు ఎందుకు చెల్లించడం లేదో అదికారుల, పాలకులకే తెలియాలి. వీరిలో ఎక్కువగా పలుకుబడిన వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు ఉన్నారు. పాలకులు దృష్టి సారిస్తే తప్ప ఈ బకాయిలు వసూలు అయ్యే అవకాశం లేదు.

కోర్టు కేసులు వల్ల రాని బకాయి రూ.5 కోట్లు?

మరోవైపు నగరంలో కోర్టు కేసులు కారణంగా ఇంకా రావాల్సింది సుమారుగా రూ.5 కోట్లు వరకు పన్ను బకాయి ఉంది. 43 మంది కోర్టు కేసులు పెడితే వాటిలో ఇటీవల 20 కేసులు వరకు పరిష్కారమయ్యాయి. ఇంకా 20 కేసులు క్లియర్ కావాల్సి ఉంది. అవి క్లియర్ అయితే మరో రూ.5కోట్లు పన్నులు వసూలు అయ్యే అవకాశాలు ఉన్నాయి. కోర్టులో కేసు వేసిన వారంతా అధిక మొత్తంలో పన్ను చెల్లించాల్సిన వారే కావడం గమనార్హం.

పన్నులు చెల్లించకుంటే ఆస్తులు జప్తు



నగరంలోని గృహ వినియోగదారులు, వ్యాపారులు, పరిశ్రమల యజమానులు పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహ కరించాలి. ప్రజలకు మౌలిక సదుపాయాలు అందించాలంటే పన్నుల ద్వారా వచ్చే ఆదాయం తోనే సాధ్యమవుతుంది. మార్చి నెలాఖరు నాటికి పన్నులు చెల్లించి సహకరించాలి. పన్నులు చెల్లించని వారికి రెడ్ నోటీసులు ఇచ్చి ఆస్తులు జప్తు చేస్తాం, గృహ వినియోగదారులకు కుళాయి కనె క్షన్లు తప్పిస్తాం. మొండి బకాయి దారులు కూడా పన్నులు చెల్లించాలి. లేదంటే మున్సిపల్ చట్టం ప్రకారం వారిపై చర్యలు తీసుకోక తప్పదు.

పివివిడి ప్రసాదరావు,
అసిస్టెంట్ కమిషనర్

రామతీర్థం ఆలయం వద్ద యాత్రికుల రద్దీ



శైవ క్షేత్రాలు కిటకిట

ప్రజాశక్తి-నెల్లిమర్ల, శృంగవరపుకోట

మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. శనివారం తెల్లవారు జామునుంచే యాత్రికులు ఆలయాలకు క్యూకట్టారు. పుణ్యగిరి, రామతీర్థం, వంగర మండలం సంగాం, విజయనగరంలోని శివాలయాలకు వందలాది మంది దర్శించుకున్నారు. అటు పార్వతీపురం మన్యం జిల్లాలోని అడ్డాపుశిల, గుంప సోమేశ్వర ఆలయాలకు జనాలు పోటెత్తారు. పారమ్మకొండపై పారమ్మతల్లికి డిప్యూటీ సిఎం రాజన్నదొర దంపతులు ప్రత్యేక పూజలు చేశారు.వంగర మండలం సంగాంలో సంగమేశ్వర స్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఎస్.కోట మండలంలోని సన్యాసేశ్వర ఆలయంలో జిల్లా జడ్జి పూజలు చేశారు. రామతీర్థం పుణ్య క్షేత్రాన్ని ఎస్‌పి ఎం.దీపిక పాటిల్ సందర్శించారు. దేవాలయం, పుష్కరిణి, రామతీర్థం కొండ వద్ద బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా, జేబు దొంగతనాలు, చోరీలు జరగకుండా చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎస్‌పి వెంట ఇన్‌ఛార్జి డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, భోగాపురం సిఐ విజయనాథ్, రూరల్ సిఐ టివి తిరుపతిరావు, 2వ పట్టణ సిఐ సి.హెచ్.లక్ష్మణరావు, దిశా స్టేషన్ సిఐ మళ్ళ శేషు తదితరులు ఉన్నారు.



పాచిపెంట... పారమ్మకొండపైకి భారీగా వెళ్తున్న యాత్రికులు



రామతీర్థంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్‌పి ఎం.దీపిక, డిఎస్‌పి

పోరాటాలకు సిద్ధం కావాలి

విజయనగరం టౌన్ : ఉద్యోగులు, ఉపాధ్యాయులు పోరాటాలకు సిద్ధం కావాలని ఎస్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.జోగారావు అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్ అధ్యక్షతన జిల్లా కౌన్సిల్ సమావేశం శనివారం అమర్‌భవన్‌లో జరిగింది. ఈసందర్భంగా జోగారావు మాట్లాడుతూ పాఠశాలల సందర్శన పేరుతో ఉన్నతాధికారులు ఉపాధ్యాయులను ఆందోళనకు గురి చేసి, కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. పని ఒత్తిడి కారణంగా ఉపాధ్యాయులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ప్రతినెలా జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం తగదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఇపిఫ్, ఎపి జిఎల్ఐ రుణాలు, సరెండర్ లీవ్‌లు, మెడకల్ లీవ్‌ల మొత్తాలను తక్షణమే చెల్లించాలన్నారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్లర్ వి.గోవిందరావు, కార్యదర్శి ఎం.మురళి, జిల్లా ఉపాధ్యక్షులు ఎంఎ స్వామి, జిల్లా అదనపు కార్యదర్శి సూరిబాలు, జిల్లా కార్యదర్శులు పి.రాంబాబు, జి.రవి, ఎస్ఎస్ దొర, కె.మహేష్ పాల్గొన్నారు.

ముగిసిన అండర్-19 చదరంగం పోటీలు

విజయనగరం టౌన్ : నగరంలోని ఫైర్ చెస్ స్కూలులో జరిగిన అండర్ 19 చెస్ టోర్నమెంట్ పోటీలు శనివారంతో ముగిశాయి. మొత్తం జిల్లా నుంచి 55 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఓపెన్ విభాగంలో మొదటి బహుమతి కాండ్రేగుల ప్రహ్లాద్, రెండో బహుమతి పవన్ కుమార్, మూడో బహుమతి రూపేష్ కుమార్, నాలుగో బహుమతి అక్కివరపు పరివేష్ గెలుచుకున్నారు. బాలికల విభాగంలో మొదట బహుమతి కుందన ప్రియ, రెండో బహుమతి అక్కివరపు జాస్మిన్, మూడో బహుమతి సాయి జాహ్నశ్రీ, నాలుగో బహుమతి రియాన్ శ్రీ గెలుపొందారు. వీరంతా విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా జెజెఎన్‌వి శ్రీనివాసరావు, కె.ధనలక్ష్మి వ్యవహరించారు. టోర్నమెంట్ డైరెక్టర్ గా సైదా బేగం వ్యవహరించారు. విజేతలకు జిల్లా అధ్యక్షులు బిఎ రావు, కార్యదర్శి కె.వి జ్వాలాముఖి అభినందనలు తెలిపారు.



విజేతలైన క్రీడాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

చంద్రబాబు అడ్డగింతపై టిడిపి నిరసనలు



నెల్లిమర్లలో అంబేద్కర్ విగ్రహానికి వినతినిస్తూ నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

ప్రజాశక్తి-విలేకర్ల బృందం

తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో చంద్రబాబు పర్యటనను పోలీసులు అడ్డుకొని కార్యకర్తలపై లాఠీ ఛార్జీ చేయడాన్ని వ్యతిరేకిస్తూ, ప్రభుత్వ తీరును నిరసిస్తూ జిల్లా వ్యాప్తంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు శనివారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పలు మండలాల్లో ర్యాలీలు నిర్వహించి అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలు అందించి నిరసన తెలిపారు.

ప్రజాశక్తి- నెల్లిమర్ల

రామతీర్థం కూడలిలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గం ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబును పోలీసులను ఉపయోగించి ప్రభుతవం అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. జగన్‌కు చంద్రబాబును చూస్తే భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సువ్వాడ రవిశేఖర్, గేదెల రాజారావు, లెంక అప్పల నాయుడు, బైరెడ్డి లీలావతి, అవనాపు సత్య నారాయణ, బొంతు వెంకట రమణ, తాడ్డి సత్య నారాయణ, కోటపాటి తిరుపతి రావు, పాల్గొన్నారు.

డెంకాడ : మండల కేంద్రంలోని మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు నిరసన తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహనికి పూలమాల వేసి వినతపత్రం అందజేశారు. మండలం టిడిపి అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు, నాయకులు కలిదిండి పాణీరాజు, కాగితాల సత్యనారాయణ, పడాల చిన్నారావు, కొయనేని రమణ, కలిదిండి రంగరాజు, కోరాడ కుమారి, సబ్బవరపు పైడినాయుడు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తోందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి అల్లాడ భాస్కరరావు విమర్శించారు. అబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు రాంబార్కి శరత్, వి.సత్యనారాయణ, టిడిపి కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జామి : అనపర్తిలో పోలీసుల అనుచిత చర్యలపై తెలుగు తమ్ముళ్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. జామి మండల కేంద్రంలో పోలీసు తీరుకు నిరసనగా ర్యాలీ నిర్వహించి, అనంతరం అంబేద్కర్ నగర్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు లగుడు రవికుమార్, పోలిపర్తి స్వామినాయుడు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బండారు పెద్దబాబు, మాజీ గ్రామ సర్పంచ్ ఇప్పాక వెంకట త్రివేణి, మాకిరెడ్డి శ్రీలక్ష్మి, యువ నాయకులు రాయవరపు శంకర్, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రామభద్రపురం : చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడానికి నిరసనగా స్థానిక మూడు రోడ్ల జంక్షన్‌లో టిడిపి నాయకలు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి, స్థానిక మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ చింతల రామకృష్ణ మాట్లాడారు. మండలపార్టీ అధ్యక్షులు విజయ భాస్కర్, కార్యదర్శి చిన్నమ్మతల్లి, సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, ఎంపిటిసిలు వసంతుల తిరుపతిరావు, బవిరెడ్డి చంద్ర, పాల్గొన్నారు.

గుర్ల : మండల కార్యాలయం ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు చనమల్ల మహేశ్వరరావు, రాష్ట్ర బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెన్నె సన్యాసి నాయుడు, జిల్లా పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమల రాజు కిరణ్ కుమార్, నాయకులు సంచాన సన్యాసి నాయుడు, దాసరి శివ ప్రసాద్, నియోజకవర్గ సోషల్ మీడియా కోర్డినేటర్ నాగుల పల్లి నారాయణ రావుతదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలిలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు

భోగాపురం : మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ అధ్వర్యంలో నిరసన తెలిపి, అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి అందజేశారు. లోకేష్ బాబు పాదయాత్రను చూసి ఓర్వలేక పోలీసులతో చంద్రబాబు పర్యటనను అడ్డుకున్నారని ఈ సందర్భంగా సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నీలాపు అప్పలరామిరెడ్డి , క్లస్టర్ ఇంఛార్జి దాసరి అప్పలస్వామి , కోరాడ తాతారావు, ముంజేరు ఎంపిటిసి పిడుగు వెంకట సత్యం, మత్స్యకార సాధికార సమితి కన్వీనర్ మైలపల్లి ఎల్లాజి, తెలుగుయువత నాయకులు కర్రోతు రాజు, మండల ఉపాధ్యక్షులు కోలా రామసూరి భోగాపురం మండల తెలుగుయువత అధ్యక్షులు సరగడ తోగులురెడ్డి, సోమిరెడ్డి, కిలిమి రామారావు, సుదీర్, అప్పల రెడ్డి పాల్గొన్నారు.

గజపతినగరం : స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు.అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతి అందజేస్తూ నిరసన తెలిపారు. మండల పార్టీ అధ్యక్షులు అట్టాడ లక్ష్మునాయుడు, మాజీ సర్పంచ్ లెంక బంగారు నాయుడు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రమాప్రభకు మద్దతుగా ప్రచారం

ప్రజాశక్తి-పాలకొండ

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో శనివారం పాలకొండ పట్టణంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు, జెవివి జిల్లా కార్యదర్శి ఎస్.ఉమా మహేష్, జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు పి.ప్రభాకర్ మాట్లాడారు. సిపిఎస్ రద్దు, ఒపిఎస్ పునరుద్ధరణ, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు రెగ్యులరైజేషన్, తదితర సమస్యలపై పనిచేసే అభ్యర్థి రమాప్రభను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.

కొమరాడ : పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభను గెలిపించాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. శనివారం రమాప్రభకు మద్దతుగా కొమరాడ, గుమడలో సిఐటియు, గిరిజన, రైతు సంఘాల ఆధ్వర్యాన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబమూర్తి, ఎపి రైతు సంఘం నాయకులు ఎ.ఉపేంద్ర, గిరిజన సంఘం నాయకులు దాలయ్య మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై నిరంతరం గళం విప్పేది పిడిఎఫ్ ఎమ్మెల్సీలు మాత్రమేనని చెప్పారు. మొదటి ప్రాధాన్యత ఓటును రమాప్రభకు వేయాలని కోరారు.





పాలకొండలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు : కొమరాడలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న నాయకులు

ప్రాణాలు పోతున్నా పట్టించుకోరే..!

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పోతే పోనీ... ప్రాణాలు మనవి కాదుగా... అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు విజయనగరం ఉమ్మడి జిల్లాలోని అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకులు. ఓవైపు పార్వతీపురం మన్యం జిల్లాలో ఏనుగుల దాడిలో మరణాల పరంపర కొనసాగుతోంది. మరోవైపు విజయనగరం జిల్లాలో పెద్దపులి సంచారం ఇంకా కొనసాగుతునే ఉంది. దీంతో, ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం గుడుపుతున్నారు. చివరకు కలెక్టర్ తన ఫ్యామిలీతో కలిసి ఏనుగుల గుంపును చూసి ఎంజాయ్ చేశారే తప్ప వాటివల్ల ప్రజలకు ప్రాణముప్పులేకుండా చేసేందుకు ప్రయత్నించలేదు. జిల్లాకు చెందిన గిరిజన శాఖ మంత్రి కూడా తనకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. విజయనగరం జిల్లాలో పశువులు ఎప్పటికప్పుడు పులికి ఆహారంగా మారుతున్నాయి. అయినా మంత్రి బొత్సకుగానీ, ఎంపీ, ఎమ్మెల్యేలకుగానీ పట్టలేదు. ఇక కలెక్టర్ చొరవ గురించి వేరేగా ప్రస్తావించక్కర్లేదు. వాస్తవానికి ఏనుగుల ప్రమాదం ఇప్పటికిప్పుడు పుట్టుకొచ్చిందేమీ కాదు. 2004లోనే పార్వతీపురం ఏజెన్సీలో ఏనుగుల ఉనికి వెలుగులోకి వచ్చింది. ఎక్కడికక్కడ పంటలు ధ్వంసం చేయడంతోపాటు ప్రాణ నష్టం సంభవించింది. అప్పటి అటవీశాఖ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలో ఉన్న అడవి ఏనుగుల గుంపును ఒడిశా ప్రాంతానికి తరలించేందుకు ఆపరేషన్ గజ కార్యక్రమాన్ని ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు చేపట్టారు. తమిళనాడు నుంచి ట్రైనింగ్ పొందిన జయంతి అనే మగ ఏనుగును తీసుకువచ్చి అడవి ఏనుగులు గుంపును తరలించేందుకు పలు రకాలుగా ప్రయత్నాలు చేసినా అది పూర్తిస్థాయిలో



విజయవంతం కాలేదు. దీంతో ఆ కార్యక్రమానికి ప్రభుత్వం ఫుల్ స్టాప్ పెట్టింది. దీంతో, మన్యం జిల్లాలో ఏనుగుల ముప్పు నాటి నుంచీ కొనసాగుతునే ఉంది. ప్రజలకు కంటిమీద కునుకులేకుండా పోతోంది. అటు పంట నష్టం, ఇటు ప్రాణ నష్టం జరుగుతుండడం పట్ల ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఇలా ఏనుగుల దాడిలో గడిచిన 16 ఏళ్లలో సుమారు 15 మంది వరకు గిరిజనులు, రైతులు మత్యువాత పడ్డారు. తాజాగా బలిజిపేట మండలం చెల్లింపేటలో ఓ వృద్ధుడిపై దాడి చేసి చంపేశాయి. అంతకు ముందు బామిని మండలంలో ఏనుగులు తరలించేందుకు వెళ్లిన ట్రాకర్ కూడా ప్రాణాలకు కోల్పోయాడు. అయినా అటు అధికారులు, ఇటు పాలకులు ఏనుగులను తరలించడం, ప్రజలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందుతునే ఉన్నారు. ఏనుగుల తరలింపు, ట్రాకింగ్ పేరిట ప్రభుత్వం నుంచి అటవీశాఖకు ఇప్పటి వరకు రూ.కోట్ల విడుదల అయ్యాయి. నిధుల కేటాయింపు, ఖర్చు నిరంతర ప్రక్రియగా మారినా సమస్య పరిష్కారానికి చూపిన చిత్తశుద్ధి కనిపించడం లేదు. అటవీ శాఖ అధికారులు ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామంటూ ఇంకా పాత పాటే పాడుతున్నారు. ఇందుకోసం పార్వతీపురం పరిసర ప్రాంతం, కొమరాడ మండలం అర్తాం, సాలూరు మండలం జంతి కొండ పరిసర ప్రాంతాలలో ఎలిఫెంట్ జోన్ కోసం బృంద సభ్యులు పరిశీలన చేసినట్టుగా చెబుతున్నారు. ఇందుకోసం రూ.70కోట్లు అవసరం ఉంటుందని అంచనా వేశారు. కేంద్రం నుంచి అనుమతులు వస్తే పనులు చేపట్టేందుకు వీలుంటుదని చెబుతున్నారు. ఇటువంటి సమస్యలేవీ అటు కేంద్ర ప్రభుత్వానికి కూడా పట్టడం లేదు.

ఘనంగా శివరాత్రి ఉత్సవాలు

- కిటకిటలాడిన శివాలయాలు
- దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యేలు
- వేలాదిగా తరలివచ్చిన యాత్రికులు
- రామతీర్థంలో బందోబస్తును పర్యవేక్షించిన ఎస్‌పి


నెల్లిమర్ల: రామతీర్థంలో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

శివరాత్రిని పురస్కరించుకుని శనివారం జిల్లా వ్యాప్తంగా ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయాల వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యంగా రామతీర్థం, పుణ్యగిరి, సంగంలో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. రామతీర్థం దేవాలయంలో నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, బొబ్బిలిలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు, కొత్తవలసలో మాజీ ఎమ్మెల్యే కోళ్లలలితకుమారి, వంగర మండలం సంగమేశ్వర స్వామి ఆలయంలో రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ప్రత్యేక పూజలు చేశారు. రామతీర్థంలోని బందోబస్తును ఎస్‌పి దీపికా పాటిల్ పర్యవేక్షించారు. పుణ్యగిరిలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికల్యాణ చక్రవర్తి ఉమారామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. జిల్లా వ్యాప్తంగా వేలాది మంది భక్తులు శివనామస్మరణతో ఆలయాలో హోరెత్తాయి..

ప్రజాశక్తి– నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానం శివనామ స్మరణతో మార్మోగింది. శనివారం శివరాత్రి జాతర పురస్కరించుకొని భక్తులు రామ స్వామి దేవస్థానానికి పోటెత్తారు. తెల్లవారు జాము నుంచి భక్తులు రామ కోనేరులో స్నాన మాచరించి తలనీలాలు సమర్పించి సీతారామ స్వాములను దర్శించుకున్నారు. సంప్రదాయ ప్రకారం పూసపాటిరేగ, భోగాపురం మండలాలకు చెందిన మత్స్యకారులు జాతరకు వచ్చి తెల్ల వారు జాము వరకు కోలాటాలు జరిపి దర్శనం చేసుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు సీతాసమేత రామ లక్ష్మణ స్వాములను దర్శించుకొని దేవస్థానం క్షేత్ర పాలకుడు ఉమా సదాశివస్వామిని కూడా దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. రెండు రోజుల పాటు జరిగే శివరాత్రి జాతరలో భక్తులు వంటలు చేసుకొని గురు భక్తుల కొండ, దుర్గ భైరవ కొండ, భీముని గుహ, నీలాచల బోడికొండ మీద కొందండ రామ స్వామిని దర్శించుకున్నారు. భక్తుల దర్శనం కోసం క్యూలైన్లు, బారికేడ్లను, రామ కోనేరులో స్నానాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు, తాగునీటి సౌకర్యం, సతివాడపి హెచ్‌సి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. తొలుత భక్తుల తాకిడి తక్కువగా ఉన్నప్పటికి క్రమేపి భక్త జన సందోహం పెరిగింది. దూర ప్రాంతాలకు చెందినవారు శివరాత్రి ఉప వాసాలు జగరాలు చేసి శనివారం రాత్రికి దర్శనాలు చేసుకోని మరుసటి రోజు వంటలు చేసుకొని స్వగ్రామాలకు వెళ్తారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడుగడుగునా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. బందోబస్తును ఎస్‌పి దీపికా పాటిల్ పర్యవేక్షించారు. ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు కుటుంబంతో సహా దర్శనం చేసుకున్నారు. దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుధారాణి, ఆర్‌డిఒ డి. అప్పారావు, తహశీల్దారు కె.వి.రమణ రాజు పర్యవేక్షణలో దేవస్థానం సహాయ కమిషనర్ డి.వి.వి. ప్రసాద్ ఏర్పాట్లు చేశారు.

నగర పంచాయతీ సిబ్బంది సేవలు

రామతీర్థం జాతరలో నెల్లిమర్ల నగర పంచాయతి సిబ్బంది సేవలు అందించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరావు, మేస్త్రి బి.నాగ మధు ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు ఆలయ పరిసరాల్లో బ్లీచింగ్ చల్లి, వ్యర్థాలు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయ వద్దని జాతరకు వచ్చే భక్తులకు సూచనలిచ్చారు.

బొబ్బిలి: బొబ్బిలిలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పెంట శివాలయంలో డిఎస్‌పి బి.మోహనరావు దంపతులు పూజలు చేశారు. యుద్ధ స్తంభం వద్ద బ్రహ్మకుమారీలు, కలవరాయి రమణ మహర్షి ఆశ్రమంలో నిర్వహించిన శివరాత్రి పూజలకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, మున్సిపల్ చైర్మన్ సావు వెంకటమురళీ కృష్ణ హాజరయ్యారు. శివరాత్రి పూజలకు శనివారం తెల్లవారుజామున నుంచి భక్తులు శివాలయాలు వద్ద క్యూ కట్టారు.

సంగాంకు పోటెత్తిన యాత్రికులు

వంగర: మహాశివరాత్రి పురస్కరించుకుని సంగాంలో సంగమేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, ఒరిస్సా, విశాఖపట్నం తదితర ప్రాంతాల నుంచి శుక్రవారం అర్ధరాత్రి నుంచి భారీ సంఖ్యలో అక్కడకు చేరుకొని నాగావళి, సువర్ణముకి, వేగావతి మూడు నదులు కలిసే త్రివేణి సంగమం వద్ద స్నానాలు ఆచరించారు. అనంతరం సంగమేశ్వర స్వామిని దర్శించుకునేందుకు ఆలయంలో క్యూ లైన్‌లలో వేచి ఉన్నారు. ఎక్కువ సమయం నిలబడి ఉండటం వల్ల ఇబ్బందులు పడ్డారు. జాతరకు వచ్చిన యాత్రికులకు పాలకొండ మండలం నీలానగరం నకు చెందిన వావిలపల్లి బాబు, పురుషోత్తమరావు అన్నదానం చేశారు. వంగరకు చెందిన తంగుడు వెంకటరమణ తాగు నీరు, మజ్జిగ సరఫరా చేశారు. వంగర మన గ్రోమోర్ సంస్థ తాగునీరు, చిన్న పిల్లలకు పాలు ఉచితంగా సరఫరా చేశారు.


వంగర: త్రివేణి సంగమం వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు.

సంగమేశ్వరుని ని దర్శించుకున్న ఎమ్మెల్యే ఎమ్మెల్సీ

మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా సంగమేశ్వర స్వామిని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్ శనివారం దర్శించుకుని ప్రత్యేపూజలు చేశారు. విజయనగరం దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కేఎల్ సుధారాణి పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఈవో పొన్నాడ శ్యామలరావు ఆధ్వర్యంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేపట్టారు. జాతరలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజాం రూరల్ సీఐ హెచ్ ఉపేంద్రరావు ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉత్తరా వెల్లి సురేష్ ముఖర్జీ, వైసిపి మండల కన్వీనర్ కరణం సుదర్శన రావు, బొక్కేల వెంకట అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

లక్కవరపుకోట: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఉన్న ఉమారామలింగేశ్వర స్వామి ఆలయంలో గ్రామానికి చెందిన శ్రీనాథ అప్పారావు కుటుంబ సభ్యులు సుమారు 3 వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గేదెల శ్రీనివాసరావు, కొత్తవలస ఎఎంసి డైరెక్టర్ కొట్యాడ శ్రీనివాసరావు, మేజర్ పంచాయితీ మాజీ సర్పంచ్ జామి రాజు, వైసిపి నాయకులు పాల్గొన్నారు. తలారి, మల్లివీడు, కల్లేపల్లిలో, నిడిగట్టు పంచాయతీలలో సుమారు రెండేసి వేల మందికి చొప్పున అన్నదాన కార్యక్రమాలను ఆయా గ్రామస్తులు నిర్వహించారు.

కొత్తవలస: మండలంలోని ఉత్తరాపల్లి జంక్షన్ గంగుబూడి వద్ద ఉన్న కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయాన్ని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు, ప్రధాన అర్చుకులు ద్వారా పంచామృతాభిషేకాలు, బిల్వార్చనలు, సహస్రనామార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాపల్లి టిడిపి సీనియర్ నాయకులు సింగంపల్లి ఎర్నాయుడు, ఇమంది లక్ష్మణరావు, పొట్నూరు వెంకట రత్నాజీ, గొంప పోతునాయుడు, గొంప దుర్గ ఉమేష్, నిరుజోగి అమ్మతల్లి నాయుడు, గొంప రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలోని వేపాడ, బాణాది, కొండ గుళ్ళు, సోంపురం, గ్రామాలలోని గల శివాలయాలలో శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేపట్టారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించుకోవడంతో ఆ ప్రాంత మంది శివనామశ్మరణతో మార్మోగింది. తెల్లవారు జాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివునికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు సౌకర్యార్థం కొన్ని ఆలయాల వద్ద క్యూలైన్లు కోసం బారి కేడ్లను ఏర్పాటు చేశారు. అర్చకులు శంకర శర్మ, మణిశర్మ, లక్ష్మీనారాయణ భక్తులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.


శృంగవరపుకోట: సన్యాసేశ్వర ఆలయం వద్ద స్నానాలు చేస్తున్న భక్తులు

శృంగవరపుకోట: మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. ధర్మవరం వద్ద గల సన్యాసేస్వర స్వామి దేవాలయంలో భక్తులు వేలాదిగా వచ్చి దర్శించుకున్నారు. ఆలయ అదనపు కార్యనిర్వహణాధికారి, నిర్వాహకుల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు మజ్జిగతో పాటు అన్న సమారాధనను నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో కాశీ విశ్వేశ్వర శివలింగాన్ని ఏర్పాటు చేసి శివుని విశిష్టతను తెలియపరిచారు. మండలంలోని కొత్తూరు గ్రామం వద్ద గల కాశీవిశ్వేశ్వర ఆలయంలో శివలింగానికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పుణ్యగిరికి వచ్చే భక్తులకు వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పులిహోర మజ్జిగను పంపిణీ చేశారు. కల్కి భగవాన్ భక్తులు పుణ్యగిరికి వచ్చే యాత్రికుల కోసం అన్నదానం చేశారు. కొట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సన్యాసేశ్వర ఆలయం వద్ద పుణ్యగిరి వద్ద మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆర్‌టిసి డిపో మేనేజర్ కే రమేష్ ఆర్టీసీ అందిస్తున్న సేవలను పర్యవేక్షించారు. పంచాయతీ సిబ్బంది పారిశుధ్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తూ భక్తులకు చలివేంద్రాలను నిర్వహించారు. పుణ్యగిరిలో శ్రీఉమాకోటిలింగేశ్వర స్వామిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయికళ్యాణ చక్రవర్తి, జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి దర్శించుకున్నారు.


బొబ్బిలి : శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పలనాయుడు


నెల్లిమర్ల: కుటుంబ సభ్యులతో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బడ్డుకొండ


ఎల్‌కోట: అన్నదానంలో పాల్గొన్న ఎంపిపి శ్రీనివాసరావు

వీడని ఏనుగుల భయం

ప్రజాశక్తి–వీరఘట్టం

మండలంలోని కిమ్మి, నడుకూరు గ్రామాల సమీపంలో ఏనుగుల గుంపు సంచరిస్తుండటంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. విజయనగరం జిల్లా వంగర మండలం తలగాం గ్రామం నుంచి వీరఘట్టం మండలంలోకి శుక్రవారం గజరాజుల గుంపు చేరుకుంది. అదేరోజు నడుకూరు గ్రామానికి చెందిన మచ్చ సన్యాసినాయుడు చెరకు తోటలోకి చేరుకుని, సాయంకాలం వరకు అక్కడే ఉన్నాయి. చీకటి పడేసరికి గ్రామ సమీపంలోకి వచ్చేశాయి. అందులో ఒక ఏనుగు గ్రామ ప్రధాన రహదారి మీదుగా సంచరిస్తూ మూలలంక గిరిజన గ్రామానికి చేరుకుంది. దీంతో పోలీసు, ఫారెస్ట్ అధికారులు అప్రమత్తమై గ్రామంలో ఉన్న షాపులను మూసి వేశారు. వాహన రాకపోకలు కూడా నిలిపివేశారు. మిగిలిన గజరాజుల గుంపు గ్రామానికి అతి దగ్గరలో ఉండటం వల్ల నడుకూరు గ్రామస్తులకు రాత్రంతా కంటిమీద కునుకు లేకుండా పోయింది. ఏ క్షణంలో గ్రామంలోకి ప్రవేశిస్తాయోనన్న భయంతో ఇళ్ల నుంచి బయటికి రాలేదు. శనివారం ఉదయం మళ్లీ పొలాల్లోకి వచ్చి తిష్ట వేశాయి.

ఏనుగుల దగ్గరికి ఎవరినీ వెళ్లనీకుండా పోలీస్ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. రైతు రౌతు రామారావుకు చెందిన మొక్కజొన్న పంటను ఏనుగులు నాశనం చేశాయి.నడుకూరు గ్రామానికి చెందిన ఎం.సన్యాసినాయుడు చెరుకు తోటలో గజరాజుల గుంపు తిష్టవేయడంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆ తోటకు నిప్పంటించారు. దీంతో చిట్టిపూడివలస వైపు పయనమైన ఏనుగులు మళ్లీ అదే స్థానానికి చేరాయి.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని మారుమూల కొండలపై ఉన్న కీసరగూడ గ్రామంలో సిమెంట్ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా ఈ పనులు మంజూరయ్యాయి. తన విజ్ఞప్తి మేరకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి సర్పంచ్ ముసురు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రహదారి నిర్మాణ పనులను కీసరగూడ గ్రామస్తుల ఆధ్వర్యంలో త్వరితగతిన చేపడతామని చెప్పారు. రహదారి నిర్మాణం వల్ల కీసరగూడ గ్రామస్తులకు ఉపాధి కూడా దొరుకుతుందని తెలిపారు.

మద్దతుధర కల్పించాలని 20న ధర్నా

సీతంపేట: గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించాలని 20న జిసిసి కార్యాలయం వద్ద ధర్నా చేపడుతున్నట్లు గిరిజన సంఘం నాయకులు పి.సాంబయ్య, ఎ.గంగాధర్, జె. శ్రీరాములు తెలిపారు. ఈ మేరకు ధర్నాను విజయవంతం చేయాలని శనివారం కుసిమి సంతలో వారు ప్రచారం చేపట్టారు. ఆరుగాలం శ్రమించిన సేకరించిన ఉత్పత్తులకు జిసిసి మద్దతు కల్పించకపోవడంతో గిరిజనులు దళారుల దోపిడీకి గురవుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

24 నుంచి పంచవర్ణేశ్వరి జాతర

గుమ్మలక్ష్మీపురం : మండలంలోని దుమ్మంగి – బొద్దిడి గ్రామాల ప్రధాన రహదారి సమీపాన ఉన్న పంచవర్ణేశ్వరి ఆలయం వద్ద ఈ నెల 24 నుంచి 28 వరకు జాతర నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ పాలక క్రాంతి కుమార్ తెలిపారు. 24న శివపార్వతిల కళ్యాణం, అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జాతర సందర్భంగా ఐదు రోజులపాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలి

వేపాడ: ప్రభుత్వ పథకాలపై గ్రామాల్లో గృహ సారథులు, మండల, సచివాలయ కన్వీనర్లు విస్తృత ప్రచారం చేయాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలో శనివారం దబ్బిరాజుపేట, సింగరాయ గ్రామాలలో కన్వీనర్లకు, గృహ సారథులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలుపై ప్రజలకు వివరించాలన్నారు. మరోసారి జగన్మోహన్‌రెడ్డిని, తతను గెలిపించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ఛైర్మన్ చినరామనాయుడు, జెడ్‌పిటిసి ఎస్ అప్పలనాయుడు, ఎంపిపి డి. సత్యవంతుడు, వైస్ ఎంపిపి ఈశ్వరరావు, జిల్లా బిసి సెల్ అధ్యక్షుడు ఎం సత్యనారాయణ, ఏఎంసీ ఛైరపర్సన్ ఎం కస్తూరి, మండల కన్వీనర్ భోజంకి శ్రీను, వైసిపి మండల అధ్యక్షుడు ఎం జగన్నాథం, నిరుజోగి వెంకటరావు, ఆర్. రాజేష్, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి – వేపాడ

మండలంలోని కొండగంగుపూడి పంచాయితీ బంగారయ్యపేట, చిట్టివానిపాలెం గ్రామాలలో నివాసముంటున్న 100 మంది గిరిజన కుటుంబాలకు శనివారం మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చేతులు మీదుగా చీరలను పంపిణీ చేశారు. పాస్టర్ చిట్టిమాల అజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆర్‌ఒ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి సుమారు 200 ఇళ్లకు ఆటో ద్వారా పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రాంప్రసాద్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి, కొండగంగుపూడి మాజీ సర్పంచ్ చల్లా వెంకటరావు, నాయకులు గనివాడ వెంకటరావు, బోనిపాటి కన్నాజీరావు, శొంఠివాని వెంకటరావు, బురుగబోయిన సింహాద్రప్పుడు, తూర్పాటి రామారావు, నిరుజోగి అమ్మతల్లి నాయుడు, అక్కిరెడ్డి వెంకటరమణ, చేపల బైరాగి, సారా దేముడు, పాతుబోయిన చిన్నయ్య, కేదాటి రాము, చిట్టి అప్పలకొండ, కడబంటి సంతోష్, దుబాయి సూర్య, సంగంవలస మణిబాబు తదితరులు పాల్గొన్నారు.


వేపాడ: లలితకుమారికి ఆహ్వానం పలుకుతున్న గిరిజన మహిళలు

వికలాంగులకు టీ షర్టులు పంపిణీ

కొత్తవలస : మహా శివరాత్రిని పురస్కరించుకుని మండల పరిధిలోని ఉన్న చైతన్య మానసిక వికలాంగుల పాఠశాలలో 40 మంది పిల్లలకు సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం టీషర్ట్, నిక్కర్, బోజనాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకు ట్రస్ట్ తరపున ఇటువంటి కార్యక్రమాలు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ట్రస్ట్ తరపున చేస్తున్న కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి బెంగళూర్‌కి చెందిన విజయలక్ష్మి, సునీత, తనూజా ఆర్థిక సహాయం చేశారు. ఫ్రూట్స్, చాక్లెట్స్, బిస్కట్లు సూర్యకుమారి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కనకాల శివ, ట్రస్ట్ సభ్యులు మీసాల దుర్గా ప్రసాద్, వై.దుర్గా ప్రసాద్, బంగారు రమేష్, కేవిఎల్‌కె శర్మ, క్రరీ చిన్నా, ఆర్‌టిసి శర్మ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కొత్తవలస: వికలాంగులకు టీ షర్టులను పంపిణీ చేస్తున్న సభ్యులు

ఎన్‌టిఆర్ విగ్రహానికి ముసుగు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి – లక్కవరపుకోట

మండల కేంద్రంలో గల సాయిబాబా జంక్షన్ సమీపంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ విగ్రహానికి ఎట్టకేలకు ముసుగు తొడిగారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్న సంగతి విధితమే. ఈ మేరకు 'ఇది కోడ్ ఉల్లంఘన కాదా?' అనే శీర్షికతో 'ప్రజాశకి"లో శనివారం ప్రచురణమైన కథనానికి స్పందిస్తూ స్థానిక రెవెన్యూ అధికారులు విగ్రహానికి ముసుగు వేశారు.


ముసుగులో విగ్రహం

పాఠశాలలో అసాంఘిక కార్యక్రమాలు

వేపాడ : మండలంలోని కరకవలస ప్రాథమిక పాఠశాల అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ఈ పాఠశాలను నాడు నేడు పనుల్లో భాగంగా అభివృద్ధి చేసినప్పటికీ ప్రహరీ నిర్మాణాన్ని పూర్తి చేయలేదు. దీంతో సాయంత్రం స్కూలు విడిచిపెట్టేసిన తరువాత మందు బాబులు పాఠశాలలోకి చొరబడి విధ్వంసం సృష్టిస్తున్నారు. కుక్కలు, పందులు లోపలికి వెళ్లి పరిసరాలను నాశనం చేస్తున్నాయి. ఈ విషయంపై ఎంఇఒ శ్రీదేవిని వివరణ కోరగా ఉప సర్పంచ్‌గా ఉన్న దుల్ల అప్పన్నను అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయవలసిందిగా పలుమార్లు కోరినప్పటికీ పట్టించుకోలేదని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని కోరుతున్నారు.


మధ్యలో నిలిచిపోయిన ప్రహరీ నిర్మాణం

ప్రతిపాదనలకే పరిమితం

- కలెక్టర్ ఆదేశించినా ముందుకు కదలని పనులు
- ఇబ్బందులు పడుతున్న బాలికలు

ప్రజాశక్తి – వేపాడ

మండలంలోని బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సూర్యకుమారి ఇటీవల సంబంధిత అధికారులను ఆదేశించారు. వెంటనే సమస్యలు పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు ఇప్పటి వరకూ పనులను మాత్రం ప్రారంభించలేదు. దీంతో బాలికలు అవస్థలు పడుతున్నారు. వసతిగృహంలో మౌలిక వసతులు, చుట్టూ పేరుకుపోయిన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించడానికి రూ. 6,67,800లు అవసరమని ఇంజనీరింగ్ అధికారిచే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించారు. ప్రతిపాదనలు పంపిణీ చేసి మూడు నెలలు కావస్తున్నా ఇంత వరకూ పనులు ప్రారంభం కాలేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి నిధులు మంజూరు చేయించి పనులు జరిగే విధంగా తగు చర్యలు చేపట్టాలని పిల్లలు తల్లిదండ్రులుఉ కోరుతున్నారు.


పిచ్చిమొక్కలు మధ్యలో ఉన్న బాలికల వసతి గృహం

కుంపల్లిలో హౌసింగ్ డే

ప్రజాశక్తి – వేపాడ

మండలంలోని కుంపల్లి గ్రామంలో శవనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండల ప్రత్యేకాధికారి పిఎస్ఎన్. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ లబ్ధిదారులందరూ గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నిర్మాణానికి నిధులు అవసరమైతే వైకేపి ద్వారా బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తారన్నారు. లబ్ధిదారులకు ఇసుక, సిమెంటు, ఇంతవరకు పని చేసినందుకు బిల్లులు చెల్లించారా లేదా అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ శ్రీనివాసరావు, ఎఇ అప్పలనాయుడు, ఎపిఎం శ్రీనివాస రావు, ఎపిఒ సన్యాసినాయుడు, ఎలక్ట్రికల్ ఎఇ శ్రీనివాస రావు, సచివాలయ సిబ్బంది, గృహ నిర్మాణ లబ్ధిదారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

ఘనంగా ఎమ్‌పి జన్మదిన వేడుకలు

గరివిడి: విజయనగరం ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ పుట్టిన రోజు వేడుకలను చీపురపల్లి పట్టణంలో వైసిపి నాయకులు శనివారం ఘనంగా చేపట్టారు. మండల నాయకులు ఇప్పిలి అనంతం, వైసిపి మండల పార్టీ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో ఎమ్‌పి తనయుడు బెల్లాన వంశీకృష్ణతో కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం గ్రామ దేవత శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఎమ్‌పి పేరు మీద ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక బాబుజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు పంచారు. శ్రీ నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక సర్పంచ్ మంగళగిరి సుధారాణి, శ్రీనివాసరావు భక్తుల కొరకు ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి టౌన్ ప్రెసిడెంట్ పతివాడ రాజారావు, కరిమజ్జి శ్రీనివాసరావు నాయుడు, మీసాల వెంకటరమణ, రఘుమండ త్రినాధ్, రేవళ్ళ సత్తిబాబు, ఇప్పిలి సూర్యప్రకాష్ (గోవింద), సర్పంచులు, ఎంపిటిసిలు, సోసైటీ చైర్మన్లు, దేవస్థానం కమిటీ సభ్యులు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


రోగులకు పళ్లు పంపిణీ చేస్తున్న వైసిపి నాయకులు

విద్యార్థినితో వాలంటీర్ పరార్

ప్రజాశక్తి– రేగిడి

మండలంలోని వావిలవలస గ్రామానికి చెందిన మైనర్ (17) విద్యార్థినిని అదే గ్రామానికి చెందిన వాలంటీర్ మీసాల లక్ష్మనాయుడు పరారయ్యాడని ఎస్ఐ ఇ. శ్రీనివాసరావు శనివారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 15న వీరు పరార్ కావడంతో బాలిక తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో గాలింపు చర్యలు చేశారు. కనిపించకపోవడంతో 17న రాత్రి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. విచారణ చేపట్టి నిందితున్ని అరెస్ట్ చేస్తామన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

చీపురుపల్లి మండలం, విజయనగరం జిల్లా **ఆంజనేయపురం** గ్రామం . సభ్యులైనటువంటి **మీసాల కామేశ్వరి** W/o **మీసాల** శ్రీనివాసరావు గారి ఇంటి పత్రాలు నెం: **1446/2004 రిజిస్ట్రేషన్ తేది : 14/12/2004** మరియు **సవరణ డాక్యుమెంట్ నెం: 1811/2005 తేది 13/10/2005** ఇల్లు మారినప్పుడు ఈ రెండు డాక్యుమెంట్లు పోవడం వలన చీపురుపల్లి పోలీస్‌స్టేషన్‌లో కంప్లైంట్ పెట్టడం జరిగింది, ఎవరికైన దొరికిన యడల ఈ క్రింది అడ్రస్ కు గాని ఫోన్ నెంబర్‌కి గాని సంప్రదించవలసినది కోరుకుంటున్నాము.

ఇట్లు

మీసాల కామేశ్వరి, W/o శ్రీనివాస రావు
ఆంజనేయపురం,చీపురుపల్లి,
విజయనగరం జిల్లా
ఫోన్: 9440334499, 9390714664